కస్టమర్ల విశ్వాసానికి..
పారదర్శక విధానాలకు..
ప్రతిరూపం
MESARA
Infra Developers Limited

BNS
BHARAT NEWS SPECTRUM
ది న్యూ వాయిస్ అఫ్ న్యూ భారత్

కస్టమర్ల విశ్వాసానికి..
పారదర్శక విధానాలకు..
ప్రతిరూపం
MESARA
Infra Developers Limited

సంపుటి - 01 | సంచిక -220 | తెలంగాణ ఆంధ్రప్రదేశ్ | 21-08-2026 | శుక్రవారం | పేజీలు : 4



# ఇళ్ల పండుగకు రంగం సిద్ధం!

- సెప్టెంబర్ 15 డెడ్‌లైన్!
- గుడిసెల్లో ఉన్నవారికే తొలి ఛాన్స్!
- 2.50 లక్షల ఇళ్లే టార్గెట్!
- ఇంటికి రూ.5 లక్షల సాయం!
- 100 నియోజకవర్గాలకు 2,500 ఇళ్లు!
- 70 వేల ఇళ్లకు రూఫ్ సాయం!
- రూఫ్ పునర్నిర్మాణానికి రూ.2 లక్షలు!
- లబ్ధిదారులపై కలెక్టర్ల ఫోకస్!
- పునాదికే రూ.లక్ష రుణం!

**న్యూస్ డెస్క్, 20 ఆగష్టు (బిఎన్ఎస్):** తెలంగాణ ప్రభుత్వం పేదల సొంతింటి కలను నిజం చేసేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఇప్పటికే తొలి విడతలో రాష్ట్రవ్యాప్తంగా లబ్ధిదారులను ఎంపిక చేయటంతో పాటు నిర్మాణాలు పూర్తి చేయించారు. తాజాగా సర్కార్ రెండో విడతపై వేగం పెంచింది. సెప్టెంబరు 15 నాటికి లబ్ధిదారులను ఎంపిక చేసి, వారికి ఇంటి నిర్మాణ మంజూరు పత్రాలు అందించేలా హౌసింగ్ కార్పొరేషన్ అధికారులు కసరత్తు చేస్తున్నారు. ప్రస్తుత ఫైనాన్షియల్ ఇయర్‌లో రాష్ట్రవ్యాప్తంగా 2.50 లక్షల ఇళ్లను పేదలకు అందించాలని రేవంత్ ప్రభుత్వం టార్గెట్‌గా పెట్టుకుంది.

హైదరాబాద్ క్యూర్ పరిధిని మినహాయించి రాష్ట్రంలోని 100 నియోజకవర్గాల్లో ఒక్కో నియోజకవర్గానికి 2500 చొప్పున ఇళ్లను మంజూరు చేయనున్నారు.

మిగతాది 2 లో..

# హైదరాబాద్ టు హాంగ్‌కాంగ్ భారీ హవాలా

- 13 చోట్ల ఏకకాలంలో ఐటీ సోదాలు
- రూ.1000 కోట్ల లావాదేవీలపై దర్యాప్తు
- రూ.900 కోట్ల చెల్లింపులపై ఫోకస్
- షెల్ కంపెనీల కోణంలో విచారణ
- సీఏ, సీఎస్‌ల ఇళ్లలోనూ సోదాలు
- మాస్టర్‌మైండ్‌పై ఐటీ ఫోకస్



2 లో

**న్యూస్ డెస్క్, 20 ఆగష్టు (బిఎన్ఎస్):** దేశాలకు నిధుల తరలింపులో భారీ అవకతవకలు జరిగాయనే అనుమానాలతో ఆదాయపు పన్ను (ఐటీ) శాఖ దేశవ్యాప్తంగా విచారణ వేగవంతం చేసింది. అందులో భాగంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని 13 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించి, రూ.1,000 కోట్ల విదేశీ చెల్లింపులపై సమగ్ర దర్యాప్తు ప్రారంభించింది. డేటా విశ్లేషణ, క్షేత్రస్థాయి నిఘా ఆధారంగా హైదరాబాద్‌లో 9, విశాఖపట్నంలో 3, గుంటూరులో ఒక ప్రాంతంలో ఐటీ బృందాలు ఈ తనిఖీలు చేపట్టాయి.

# పాలిటెక్నిక్ విద్యార్థులపై సీఐ దౌర్జన్యం..



2 లో

- సీఐ రఘుపతిపై ఎస్పీ ఆదేశాలు
- విద్యార్థుల గొంతు పట్టుకున్న సీఐ
- వైరల్‌గా మారిన సీఐ దౌర్జన్య వీడియో
- సీఐ తీరుపై ప్రతిపక్షాల తీవ్ర విమర్శలు
- ఘటనపై సమగ్ర విచారణకు ఆదేశం
- పోలీసుల తీరుపై సర్వత్రా విమర్శలు

# 22ఏ అంశంపై రాహుల్‌కు హరీశ్ లేఖ

- పొంగులేటిని బర్తరఫ్ చేయాలి
- 22ఏ పేరుతో వసూళ్లంటూ ఆరోపణలు
- ప్రైవేట్ ఆస్తులపై వేధింపులు
- 30 శాతం కమీషన్ల రాకెట్?



2 లో

**న్యూస్ డెస్క్, 20 ఆగష్టు (బిఎన్ఎస్):** తెలంగాణలో నిషేధిత భూముల (22ఏ) పేరుతో రెవెన్యూ శాఖలో అడ్డగోలు అవినీతి జరుగుతోందని ఆరోపిస్తూ లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు బహిరంగ లేఖ రాశారు. 22ఏ దుర్వినియోగం, వసూళ్ల పర్వంపై తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని తక్షణమే మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు.

నిషేధిత భూముల రిజిస్ట్రేషన్లు ఆపడానికి తెచ్చిన చట్టాన్ని ప్రైవేటు ఆస్తులపై కృత్రిమ వివాదాలు సృష్టించి వసూళ్లకు పాల్పడటానికి ఉపయోగిస్తున్నారని హరీశ్‌రావు ఆరోపించారు.

# రేవంత్ విదేశీ పర్యటనపై అర్వింద్ ఫైర్



2 లో

- సోరోస్ సంస్థలతో భేటీలపై సంచలన ఆరోపణలు
- రేవంత్ టూర్ ఎజెండా బయటపెట్టాలన్న అర్వింద్
- యాంటీ ఇండియా శక్తులతో భేటీలేంటి
- అధికారులకు అర్వింద్ సంచలన హెచ్చరిక
- రేవంత్ మిమ్మల్ని కాపాడలేరన్న అర్వింద్
- 2029లో బీజేపీ అధికారంలోకి వస్తుందన్న ధీమా

# పాక్‌కు భారత్ స్ట్రాంగ్ కౌంటర్



2 లో

- హైకమిషన్ వద్ద కూల్చివేతలు
- బుల్డోజర్‌తో అక్రమ నిర్మాణాల తొలగింపు
- బారికేడ్లు, షెడ్లు నేలమట్టం
- పరిమితి దాటిన నిర్మాణాలపై చర్యలు
- పాక్ చర్యకు ప్రతిచర్యగా ఆపరేషన్
- హైకమిషన్ భద్రంగానే ఉంది

# డీఎస్సీపై జగన్ మరోసారి ఫైర్

- లోకేష్ రాజీనామా చేయాలి
- సీబీఐ విచారణకు డిమాండ్
- ఒకే అధికారి చేతిలో రెండు బాధ్యతలు
- నవీన్ వ్యవహారంపై జగన్ ప్రశ్నలు
- ప్రభుత్వం సమాధానం చెప్పాలి
- డీఎస్సీ అక్రమాలపై పోరాటం



**న్యూస్ డెస్క్, 20 ఆగష్టు (బిఎన్ఎస్):** ఏపీ డీఎస్సీ 2025లో జరిగినట్లు ఆరోపణలు వస్తున్న ప్రశ్నపత్రం లీకేజీ, అవకతవకల అంశంపై మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మరోసారి స్పందించారు. డీఎస్సీ వ్యవహారంలో తాము చేస్తున్న ఆరోపణలు వాస్తవమేనని ప్రభుత్వం అంగీకరిస్తోందన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని, డీఎస్సీ అవకతవకలపై సీబీఐతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ ప్రశ్నపత్రాల తయారీ, పరీక్షల నిర్వహణ వంటి కీలక బాధ్యతలను ఒకే అధికారి చేతిలో పెట్టడమే అక్రమాలకు కారణమైందని ఆరోపించారు. ప్రతిపక్షం లేకుండా తండ్రీకొడుకులే బౌలింగ్, బ్యాటింగ్ చేసుకుంటూ గొప్పలు చెప్పుకుంటున్నారని సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌పై జగన్ విమర్శలు చేశారు.

వైఎస్ జగన్ మీడియాతో మాట్లాడుతూ... 'ఏపీపీఎస్సీ గ్రూప్-1పై ప్రభుత్వం తప్పుడు ఆరోపణలు చేసింది. డీఎస్సీ అవకతవకలపై సీబీఐ విచారణ జరిపించాలి. తప్పు చేశారు అని క్లియర్ కట్‌గా ఉన్నా.. సీబీఐ విచారణకు ఒప్పుకోవడం లేదు. డీఎస్సీలో అక్రమాలపై పోరాడుతున్నాం. మేం పోరాడుతున్న అంశాలు వాస్తవమే అని ప్రభుత్వం అంగీకరించింది. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలి, సీబీఐ ఎంక్వైరీ వేయాలి.

2 లో

# సుస్మిత వ్యాఖ్యలపై పీసీసీ చీఫ్ ఫైర్

2 లో

- పార్టీ లైన్ దాటితే చర్యలు తప్పవు
- సురేఖ, చిన్నారెడ్డికి వివరణ కోరాం
- క్రమశిక్షణ కమిటీ సిఫార్సుల మేరకు చర్యలు
- తానే అభ్యర్థినంటే కుదరదన్న మహేశ్
- ఎవరికి వారే సీటు ప్రకటించుకోవద్దు
- పార్టీలో సీట్లకు ప్రత్యేక విధానం ఉంది

# సుస్మిత వ్యాఖ్యలతో నాకేం సంబంధం?

- సుస్మిత వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగతం
- నాకు ఎలాంటి సంబంధం లేదు
- నోటీసులు ఉపసంహరించుకోవాలని విజ్ఞప్తి
- పీసీసీ క్రమశిక్షణ కమిటీకి లేఖ
- నన్ను బాధ్యురాలిని చేయడం సరికాదు
- నా ప్రమేయం లేదని స్పష్టం
- కాంగ్రెస్ నాయకత్వంపై గౌరవం ఉంది



2 లో

# ఉచిత పథకాలపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం

- రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై కోర్టు ఆందోళన
- ఉచితాల నిధుల మళ్లింపుపై కోర్టు ప్రశ్న
- ఉద్యోగుల పెన్షన్లపై హైకోర్టు కీలక వ్యాఖ్యలు
- భూబాధితుల పరిహారాలపై కోర్టు నిలదీత
- నిరుద్యోగులకు ఉద్యోగాలివ్వాలన్న హైకోర్టు
- సమగ్ర వివరాలతో కౌంటర్ దాఖలు చేయండి

2 లో

# 'మేం జెన్ జీ' అంటూ యువతి హంగామా

- యువతి హంగామాపై ఒమర్ స్ట్రాంగ్ కౌంటర్
- సెక్యూరిటీ సిబ్బందితో యువతి వాగ్వాదం
- ట్రాఫిక్ నిలిపివేతపై యువతి ఆగ్రహం
- 'జెన్ జీ' వ్యాఖ్యలపై సీఎం ఘాటు స్పందన
- భద్రతా నిబంధనలు పాటించాల్సిందే అన్న ఒమర్
- యువతి తీరుపై నెటిజన్ల ఆగ్రహం

2 లో

# సుస్మిత వ్యాఖ్యలపై పీసీసీ చీఫ్ ఫైర్

**న్యూస్ డెస్క్, 20 ఆగష్టు (బిఎన్ఎస్):** మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత వ్యాఖ్యలపై పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సుస్మిత, చిన్నారెడ్డి అది ఎవరైనా పార్టీ లైన్ దాటి మాట్లాడితే ఎంతటివారినైనా ఉపేక్షించేంది లేదని హెచ్చరించారు. గురువారం నిజామాబాద్ లో మీడియాతో మాట్లాడిన మహేశ్ కుమార్ గౌడ్.. సుస్మిత వ్యాఖ్యలపై ఇప్పటికే కొండా సురేఖను, తన వ్యాఖ్యలపై చిన్నారెడ్డిని వివరణ కోరామన్నారు. వీరు ఇచ్చే వివరణ తదనంతరం క్రమశిక్షణ కమిటీ సిఫార్సుల మేరకు చర్యలు ఉంటాయన్నారు. కొండా సూరేఖ, చిన్నారెడ్డి పార్టీలో సీనియర్ నాయకులని.. వీరంటే మా అందరికీ అందరికీ గౌరవమే కానీ పార్టీలో ఉన్నప్పుడు క్రమశిక్షణతో ఉండాల్సిందేనన్నారు.

నేనే ఎమ్మెల్యే అభ్యర్థి అంటే కుదరదు:

ఎన్నికలకు మరో రెండుళ్లు ఉండగానే పరకాల ఎమ్మెల్యే అభ్యర్థిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎలా ప్రకటిస్తారు? ఎవరు ఏం చెప్పినా రాబోయే ఎన్నికల్లో పరకాల నుంచి పోటీ చేయబోయేది తానేనంటూ సుస్మితా చేసిన వ్యాఖ్యలపై మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. అభ్యర్థులు ఎవరు ప్రకటించినా అది చెల్లదని నేనే ఎమ్మెల్యే అభ్యర్థి అంటే కుదరదన్నారు. సీట్ల కేటాయింపు విషయంలో పార్టీలో ఒక విధానం ఉందని నాతో సహా అందరూ ఆ విధానానికి లోబడాల్సిందేనన్నారు. ఎవరికి వారు తమకు తామే సీటు ప్రకటించుకోవడం సరికాదన్నారు. ఎరుపు, పచ్చ కాంగ్రెస్ అంటూ ఏది లేదని పాత, కొత్త అందరు నేతల వల్ల పార్టీలి లబ్ధి చేకూరిందన్నారు.

# డీఎస్సీపై జగన్ మరోసారి ఫైర్

మొదటి పేజీ తరువాయి

డీఎస్సీలో అక్రమాలపై ఆధారాలు ప్రజల ముందు ఉంచాం. డీఎస్సీలో అక్రమాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ప్రశ్నిస్తే గింజుకుంటున్నారు తప్పు ఒప్పుకోవడం లేదు. అసెంబ్లీలో మాట్లడతారు కానీ కౌన్సిల్‌లో మాట్లాడరు. అందరికీ అర్థమవుతుందనే మండలిలో చర్చించడం లేదు. తప్పులను ప్రతిపక్షం ఎత్తిచూపుతుందని సీఎం చంద్రబాబుకు భయం. డీఎస్సీ పేపర్ తయారీ, పరీక్షల నిర్వహణ ఒకే అధికారి చేతిలో పెట్టి తప్పేముందని లోకేష్ అంటున్నారు. ఏపీ డీఎస్సీ నియామకాల చరిత్రలో రెండు బాధ్యతలు ఒకే వ్యక్తికి ఎప్పుడూ అప్పగించలేదు. రెండూ ఒక్కరికే అప్పగించడం వల్ల అక్రమాలకు బీజం పడింది' అన్నారు.

'డీఎస్సీ పేపర్ తయారీ, నిర్వహణ ఒక్కరే చేయడం వల్ల చెక్స్ అండ్ బ్యాలెన్స్ తప్పి స్కాంకు నాంది పడింది. ఒకే వ్యక్తి చేతిలో ఈ బాధ్యతలు ఎందుకు పెట్టారు?. డీఎస్సీ పేపర్ తయారు చేసిన ఔట్ సోర్సింగ్ ఉద్యోగి నవీన్‌కు ఫస్ట్ ర్యాంక్ వచ్చిందని అసెంబ్లీలో చంద్రబాబు, లోకేష్ ఒప్పుకున్నారు. ఆ తర్వాత నవీన్ పేరు తీసేసి సెకండ్ మెరిట్ లిస్ట్ ఇచ్చారు. ఫస్ట్ మెరిట్ లిస్టులో ఉన్న ఫస్ట్ ర్యాంకర్ నవీన్‌కు ఎందుకు ఉద్యోగం రాలేదు. నవీన్ పేరు తీసేసి సెకండ్ మెరిట్ లిస్ట్ ఎందుకు ఇచ్చారు?. సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు రానందునే నవీన్‌కు ఉద్యోగం ఇవ్వలేదని చంద్రబాబు, లోకేష్ అంటున్నారు. ఇదే వాస్తవం అయితే నవీన్ కోర్టుకు ఎందుకెళ్లాడు?. తన లాగిన్ ఐడీ బ్లాక్ చేశారని, కాల్ లెటర్ పంపలేదని నవీన్ కోర్టుకెళ్లాడు. తన లాగిన్ ఐడీ బ్లాక్ చేశారంటూ విద్యాశాఖకు నవీన్ మెయిల్ పెట్టాడు. కాల్ లెటర్ పంపనప్పుడు నవీన్ సర్టిఫికేషన్‌కు ఎందుకు వస్తాడు?' అని వైఎస్ జగన్ ప్రశ్నించాడు.

ఏపీపీఎస్సీ గ్రూప్-1 అంశంలో ప్రభుత్వం తమపై తప్పుడు ఆరోపణలు చేసిందని వైఎస్ జగన్ ఆరోపించారు. డీఎస్సీ అక్రమాలపై తాము ప్రజల ముందు అనేక అంశాలను ఉంచామని, వాటిపై ప్రభుత్వం సమాధానం చెప్పాల్సి ఉందని అన్నారు. తమను ప్రధాన ప్రతిపక్ష పార్టీగా ప్రభుత్వం అంగీకరించడం లేదని కూడా ఆరోపించారు. ప్రతిపక్ష నేతగా తమకు అసెంబ్లీలో ఎక్కువ సమయం ఇవ్వాల్సి వస్తుందనే ఉద్దేశంతోనే తమను ఆ హోదాలో అంగీకరించడం లేదని వ్యాఖ్యానించారు.

# 22ఏ అంశంపై రాహుల్‌కు హరీశ్ లేఖ

మొదటి పేజీ తరువాయి

జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ సహా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల్లో ఎచ్ఎండీఏ అనుమతులు ఉన్న వేలాది ప్రైవేటు ఆస్తులను ఏకపక్షంగా 22ఏ జాబితాలో చేర్చి ప్రజలను వేధిస్తున్నారని పేర్కొన్నారు. అర్బన్ ల్యాండ్ సీలింగ్ కింద దశాబ్దాల క్రితమే క్రమబద్ధీకరించిన ఆస్తులు, రిజిస్టర్డ్ డాక్యుమెంట్లు ఉన్న భూములను మళ్లీ నిషేధిత జాబితాలో పెట్టి స్తంభింపజేయడం దుర్మార్గమని హరీశ్ రావు మండిపడ్డారు.

**30 శాతం కమీషన్లు..**

రెవెన్యూ శాఖలో 30 శాతం వసూళ్ల రాకెట్ నడుస్తోందని, నిషేధిత జాబితా నుంచి ఆస్తులను తొలగించడానికి దళారులు మార్కెట్ విలువలో 30 శాతం కమీషన్లు డిమాండ్ చేస్తున్నారని హరీశ్ రావు సంచలన ఆరోపణ చేశారు. ఓఆర్ఆర్ చుట్టుపక్కల ఉన్న విలువైన భూములపై వివాదాలు సృష్టించి, రాజకీయ పలుకుబడి ఉన్న బినామీ సంస్థలతో 50:50 జాయింట్ డెవలప్‌మెంట్ అగ్రిమెంట్లకు ఒప్పుకోవాలని యజమానులపై ఒత్తిడి తెస్తున్నారని విమర్శించారు. యాదాద్రి జిల్లాలో 40 వేల ఎకరాలను 22ఏలో పెట్టారని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి నాలుగు నెలల క్రితమే చెప్పినా సీఎం రేవంత్ రెడ్డి మౌనంగా ఉండటాన్ని ప్రశ్నించారు. ప్రైవేటు వ్యక్తుల లాభం కోసం ఇంత పెద్ద కుంభకోణం జరుగుతున్నా చర్యలు తీసుకోకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శమని హరీశ్ రావు అన్నారు.

**రిటైర్డ్ జడ్జితో స్వతంత్ర విచారణకు డిమాండ్..**

2023 డిసెంబర్ నుంచి ఇప్పటి వరకు 22ఏ జాబితాలో చేర్చిన, తొలగించిన ప్రతి భూమిపైనా రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తితో స్వతంత్ర విచారణ జరిపించాలని, ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కమీషన్లు, జాయింట్ డెవలప్‌మెంట్ అగ్రిమెంట్ల వెనుక ఉన్న పెద్దలు, దళారులు, బినామీ సంస్థల వెనుక ఉన్న రాజకీయ శక్తుల నిజా నిజాలను తేల్చాలన్నారు. జిల్లాల వారీగా 22ఏ జాబితాను పబ్లిక్ డొమైన్‌లో ఉంచి పారదర్శకత పాటించాలని కోరారు. ఒక అవినీతి మంత్రిని కాపాడుకోవడం కోసం ప్రజల విశ్వాసాన్ని పణంగా పెడుతున్నారని, రాహుల్ గాంధీ వెంటనే జోక్యం చేసుకోకపోతే కాంగ్రెస్ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఈ ఆరోపణలు అబద్ధమైతే వెంటనే విచారణకు ఆదేశించి ప్రభుత్వం నిజాయితీ నిరూపించుకోవాలని, లేదంటే బాధితులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పోరాటం ఆపదని స్పష్టం చేశారు.

# పాక్‌కు భారత్ స్ట్రాంగ్ కౌంటర్




**న్యూస్ డెస్క్, 20 ఆగష్టు (బిఎన్ఎస్):** దేశ రాజధాని ఢిల్లీలోని పాకిస్థాన్ హైకమిషన్ కార్యాలయం వెంట సరిహద్దులను దాటి నిర్మించిన పలు కట్టడాలు, భద్రతా బారికేడ్లను అధికారులు గురువారం ఉదయం తొలగించారు. ఇస్లామాబాద్‌లోని భారత హైకమిషన్ వెలుపల అమర్చిన భద్రతా బారికేడ్లను, పార్కింగ్ పోల్స్‌ను పాక్ ఇటీవల తొలగించినందుకుగాను ప్రతిచర్యగా న్యూఢిల్లీ అధికారులు ఈ చర్యలు పూనుకున్నారు. ఈ ఆపరేషన్ కోసం అధికారులు బుల్డోజర్‌ను ఉపయోగించి పాకిస్థాన్ హైకమిషన్ వెలుపల ఉన్న దారిలో నిర్మించిన రోడ్లు, వీసా సెక్షన్ సమీపంలో క్యూ లైన్ కోసం ఏర్పాటు చేసిన బారికేడ్లు, మెటల్ ఫెన్సింగ్, షెడ్లు, ఐరన్ బారికేడ్లను పూర్తిగా తొలగించారు.

ఈ సందర్భంగా అధికారులు మీడియాతో మాట్లాడుతూ.. పాక్ హైకమిషన్ కార్యాలయ నిర్మాణానికి ఇచ్చిన లిమిట్‌ను దాటి ఆక్రమించి నిర్మించిన కట్టడాలను మాత్రమే తాము కూల్చివేసినట్లుగా వెల్లడించారు. పాకిస్థాన్ హైకమిషన్ మెయిన్ ఎంట్రెన్స్, ఇంటర్నల్ కాంప్లెక్స్ సురక్షితంగానే ఉన్నాయని, కేవలం బయట రోడ్డు వైపు విస్తరించిన భాగాలను మాత్రమే తొలగించామని స్పష్టం చేశారు.

# హైదరాబాద్ టు హాంగ్‌కాంగ్ భారీ హవాలా

మొదటి పేజీ తరువాయి

హాంకాంగ్, సింగపూర్, యూకే, చైనా, ఇండోనేషియా వంటి దేశాల్లోని సంస్థలకు భారీగా నిధులు మళ్లినట్లు అధికారులు ప్రాథమికంగా గుర్తించారు.

ఈ ఆపరేషన్‌లో విశాఖపట్నం కేంద్రంగా పనిచేస్తున్న 'స్టాక్‌పైల్ సాఫ్ట్‌టెక్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్' సంస్థపై ఐటీ శాఖ ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఈ ఒక్క సంస్థ నుంచే సుమారు రూ.900 కోట్ల విదేశీ చెల్లింపులు జరిగినట్లు గుర్తించి, కంపెనీ డైరెక్టర్లు దీపక్ నంబరు, మాధవ రామ్ పొనపల్లి నివాసాలు, కార్యాలయాల్లో అధికారులు తనిఖీలు చేశారు. అలాగే గుంటూరులోని అరుండల్‌పేటకు చెందిన ఒక వ్యక్తి ప్రాంగణంలో జరిగిన సోదాల్లో రూ.130 కోట్ల విలువైన లావాదేవీలకు సంబంధించిన 15 అనుమానాస్పద సర్టిఫికెట్‌లను స్వాధీనం చేసుకున్నారు. సాఫ్ట్‌వేర్, కన్సల్టింగ్, రవాణా సేవల పేరుతో ఈ చెల్లింపులు జరిపినట్లు చూపుతున్నప్పటికీ, ఆయా సేవలు నిజంగా అందాయా లేదా కొన్ని ఉనికిలో లేని షెల్ కంపెనీలకు నిధులు తరలించారా అనే కోణంలో విచారణ జరుపుతున్నారు.

ఈ అక్రమ నిధుల మళ్లింపు ప్రక్రియలో ఫామ్ 15సిబి ధ్రువీకరణ పత్రాలను జారీ చేసిన వృత్తి నిపుణుల పాత్రపై కూడా అధికారులకు అనుమానాలు వ్యక్తమయ్యాయి. హైదరాబాద్‌లో ఒక చార్టర్డ్ అకౌంటెంట్ (సిఏ), ఒక కంపెనీ సెక్రటరీ (సిఎస్) నివాసాల్లో సోదాలు నిర్వహించి పత్రాలను పరిశీలించారు. చాలా తక్కువ వ్యాపార టర్నోవర్ ఉన్న సంస్థలు, అసలు ఐటీ రిటర్నులు దాఖలు చేయని కంపెనీలు కూడా భారీ మొత్తంలో విదేశీ రెమిటెన్సులు జరిపినట్లు డేటా విశ్లేషణలో తేలింది. తక్కువ సంఖ్యలో ఉన్న కొందరు నిపుణులే అత్యధిక సంఖ్యలో సర్టిఫికెట్లు జారీ చేసి, ఈ నిధులను కొన్ని ప్రత్యేక విదేశీ సంస్థల సమూహాలకే పంపినట్లు ఆధారాలు లభించాయి.

గతంలో నకిలీ ధార్మిక ట్రస్టుల ద్వారా జరిగిన అకామిడేషన్ ఎంట్రీల దర్యాప్తు నుంచి ఈ విదేశీ చెల్లింపులకు సంబంధించిన కీలక లింకులు బయటపడ్డాయి. దేశవ్యాప్తంగా ఆగస్టు 18న ప్రారంభమైన ఈ ప్రత్యేక ధ్రువీకరణ ప్రక్రియలో భాగంగా మొత్తం 394 సంస్థలు, 36 మంది వృత్తి నిపుణులపై ఐటీ శాఖ నిఘా పెట్టింది. వీటిలో భూ సరిహద్దు రాష్ట్రాలకు చెందిన 117 సంస్థలు కూడా ఉన్నాయి. స్వాధీనం చేసుకున్న డిజిటల్ ఆధారాలు, బ్యాంక్ ఖాతాలు, పన్ను పత్రాల విశ్లేషణ పూర్తయిన తర్వాత ఈ విదేశీ చెల్లింపుల వెనుక ఉన్న అసలు మాస్టర్‌మైండ్ వివరాలు బయటకు రానున్నాయి.

# ఇళ్ల పండుగకు రంగం సిద్ధం!

మొదటి పేజీ తరువాయి



రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన సర్వేలో సుమారు 50 వేల మంది పేదలు ఇప్పటికీ గుడిసెల్లో నివసిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. రెండో విడతలో వీరికి ప్రాధాన్యం ఇవ్వాలని సర్కార్ డిసైడ్ అయ్యారు.

ఇదే సమయంలో రూఫ్ పునఃప్రారంభం పేరుతో మరో ప్రత్యేక కార్యక్రమాన్ని అమలు చేసేందుకు సిద్ధమైంది. ఈ కార్యక్రమం కింద 70 వేల ఇళ్లకు ఆర్థిక సహాయం అందించనున్నారు. ఒక్కో నియోజకవర్గానికి 700 ఇళ్ల చొప్పున ఎంపిక చేసి.. ఇప్పటికే ఉన్న ఇళ్ల పైకప్పుల ఆధునికీకరణ, పునర్నిర్మాణానికి ఒక్కో కుటుంబానికి రూ.2 లక్షల చొప్పున అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆయా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో కలెక్టర్లకు కీలక బాధ్యతలు అప్పగించారు. గ్రౌండ్ లెవల్‌లో రూపొందించిన తుది జాబితాను జిల్లా కలెక్టర్ పరిశీలించిన అనంతరం సంబంధిత ఫైల్ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి వద్దకు పంపుతారు. మంత్రి ఆమోదం పొందిన తర్వాత లబ్ధిదారుల పేర్లను అధికారికంగా ప్రకటించనున్నారు. ఈ మొత్తం ప్రక్రియను వచ్చే నెల 15లోగా పూర్తి చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు.

రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల కోసం సర్కార్ రూ.10,400 కోట్లను కేటాయించింది. ఇందులో 1.80 లక్షల ఇళ్ల నిర్మాణానికి ఒక్కో ఇంటికి రూ.5 లక్షల చొప్పున మట్నొత్తం రూ.9 వేల కోట్లు ఖర్చు చేయనున్నారు. మరో 70 వేల ఇళ్లకు రూఫ్ పునఃప్రారంభం కింద రూ.2 లక్షల చొప్పున రూ.1400 కోట్లను ఖర్చు పెట్టనున్నారు. ఇందిరమ్మ ఇంటికి ప్రభుత్వం అందించే రూ.5 లక్షలను నాలుగు దశల్లో చెల్లించనుంది. అయితే తొలి విడతలో చాలా మంది లబ్ధిదారులు పునాది నిర్మాణానికే డబ్బులు లేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈసారి ఆ సమస్యను అధిగమించేందుకు మహిళా సంఘాల ద్వారా లబ్ధిదారులకు ముందుగానే రూ.లక్ష రుణంగా అందించే విధంగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

# 'మేం జెన్ జీ' అంటూ యువతి హంగామా..




**న్యూస్ డెస్క్, 20 ఆగష్టు (బిఎన్ఎస్):** లడఖ్-కాశ్మీర్ సరిహద్దులోని కార్గిల్ జిల్లా ద్రాస్ వద్ద గల మినిమార్గ్ చెక్ పోస్ట్ వద్ద ఓ యువతి భద్రతా బలగాలపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ చేసిన వీరంగం సోషల్ మీడియాలో తీవ్ర దుమారం రేపుతోంది. భద్రతా కారణాలు, వీఐపీ కదలికల దృష్ట్యా ట్రాఫిక్‌ను కొన్ని గంటల పాటు నిలిపివేసిన సమయంలో సదరు యువతి సెక్యూరిటీ ఫోర్సెస్‌తో ఘర్షణకు దిగింది.

వ్యాన్లను అడ్డుకుంటూ హల్‌చల్..

అయితే, సదరు యువత భద్రతా సిబ్బంది వెళ్తున్న వ్యాన్లను అడ్డకుంటూ 'మేము జెన్ జీ.. మేము ఈ నాన్‌సెన్స్‌ను అస్సలు సహించం' అని కామెంట్ చేసింది. 'మేము డబ్బులు పెట్టి ఇక్కడకు వచ్చింది ఇలా గంటల తరబడి వేచి చూడటానికి కాదు. కాశ్మీరీలతో చేసినట్లే ఇప్పుడు పర్యాటకులతోనూ ప్రవర్తిస్తున్నారు' అంటూ సదరు యువతి ఆగ్రహం వ్యక్తం చేస్తూ మిగతా పర్యాటకులను కూడా రోడ్డుపైకి రమ్మని అరిచింది.

సీఎం ఒమర్ అబ్దుల్లా రియాక్షన్ ఇదే..

అయితే, యువతి వీడియో కాస్త వైరల్ అవ్వడంతో ఈ వివాదంపై స్వయంగా జమ్మూ కాశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా సోషల్ మీడియా వేదికగా తీవ్రంగా రియాక్ట్ అయ్యారు. 'మేము జెన్ జీ అనడం.. పూర్వం వాడిన 'మా నాన్న ఎవరో నీకు తెలియదా అనే అహంకారపూరిత బెదిరింపు మాటలకే కొత్త రూపంలా మారింది. ప్రతీ చిన్న అసౌకర్యానికి 'జెన్ జీ' అని బెదిరింపులా మాట్లాడితే ఆ తరంపై ఉన్న గౌరవం, సానుభూతి పూర్తిగా తుడిచిపెట్టుకుపోతుంది' అని ఆయన విమర్శించారు. భద్రతాపరమైన సున్నితమైన ప్రాంతాల్లో చెకింగ్‌లు, ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరి అని, ఇలాంటి ప్రవర్తన సరికాదని నెటిజన్లు సైతం ఆ యువతి తీరును సీఎం ఒమర్ అబ్దుల్లా తప్పుబడుతున్నారు.

# సుస్మిత వ్యాఖ్యలతో నాకేం సంబంధం?



**న్యూస్ డెస్క్, 20 ఆగష్టు (బిఎన్ఎస్):** తెలంగాణ కాంగ్రెస్ లో ప్రకంపనలు సృష్టించిన కొండా సుశ్మిత వ్యాఖ్యలపై ఆమె తల్లి, మంత్రి కొండా సురేఖ రియాక్ట్ అయ్యారు. సుస్మిత వ్యాఖ్యలు ఆమె వ్యక్తగత అభిప్రాయం అని పీసీసీ క్రమశిక్షణా కమిటీకి కొండా సురేఖ వివరణ ఇచ్చారు. సుస్మిత వ్యాఖ్యలపై తనకు నోటీసులు జారీ చేసిన నేపథ్యంలో గురువారం కొండా సురేఖ క్రమశిక్షణ కమిటీకి లేఖ రూపంలో వివరణ ఇచ్చారు. ఒకరి అభిప్రాయాలకు మరొకరు బాధ్యత వహించాలనడం, సుస్మిత వ్యాఖ్యలకు నన్ను బాధ్యురాలిని చేయడం సరికాదన్నారు. ఇది సహజ న్యాయ స్ఫూర్తికి విరుద్ధం అని ఈ అంశంలో నా ప్రమేయం లేదని గుర్తించాలని వివరణ లేఖలో పేర్కొన్నారు. సుస్మిత వ్యాఖ్యలపై తనకు జారీ చేసిన నోటీసులను ఉపసంహరించుకోవాలని, కాంగ్రెస్ నాయకత్వంపై నాకు గౌరవం ఉందని పేర్కొన్నారు.

# ఉచిత పథకాలపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం



**న్యూస్ డెస్క్, 20 ఆగష్టు (బిఎన్ఎస్):** రాష్ట్రంలో అమలు చేస్తున్న కల్యాణలక్ష్మి, షాదీముబారక్ వంటి ఉచిత పథకాల చట్టబద్ధతపై దాఖలైన పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ పథకాలకు సంబంధించి విధించిన స్టేను తొలగించేందుకు ధర్మాసనం నిరాకరించింది. విచారణ సందర్భంగా ప్రభుత్వం సమర్పించిన అఫిడవిట్‌ను పరిశీలించిన కోర్టు, అందులో సరైన వివరాలు లేవని తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది.

ఇలాంటి ఉచిత పథకాల వల్ల రాష్ట్రంలో ఆర్థిక ప్రమాద ఘంటికలు మోగుతున్నాయని హైకోర్టు స్పష్టం చేసింది. ఉచిత పథకాలకు పరిమితి లేకుండా నిధులు మళ్లించడం వల్ల ఇతర అత్యవసర రంగాలపై తీవ్ర ప్రభావం పడుతోందని అభిప్రాయపడింది. ముఖ్యంగా ఉద్యోగులు పదవీ విరమణ పొందినప్పటికీ.. వారికి అందాల్సిన ఫించన్లు, బెనిఫిట్స్ సమయానికి చెల్లించలేకపోతున్నారని ఆందోళన వ్యక్తం చేసింది. ఫలితంగా బెనిఫిట్స్ అందక నిరాశకు గురైన చాలామంది ఉద్యోగులు న్యాయం కోసం కోర్టు తలుపు తడుతున్నారని గుర్తుచేసింది.

నిర్బంధ భూసేకరణ బాధితులకు చెల్లించాల్సిన పరిహారాలను పక్కనపెట్టి ఉచిత పథకాలకు నిధులు ఎలా కేటాయిస్తారని కోర్టు ప్రశ్నించింది. ప్రజాధనాన్ని ఇలా మళ్లించే బదులు, భూబాధితులకు సకాలంలో పరిహారం చెల్లించి, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తే అసలు ప్రజలకు ఇటువంటి పథకాల అవసరమే ఉండదని వ్యాఖ్యానించింది. ప్రభుత్వ రంగాలు లాభాలు గడిస్తే ఆ నిధులతో సంక్షేమం చేయవచ్చు కానీ.. ఆర్థిక స్థితిని మించి ఉచితాలు పంచడం సరైంది కాదని స్పష్టం చేస్తూ, సమగ్ర వివరాలతో కూడిన కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది.

# పాలిటెక్నిక్ విద్యార్థులపై సీఐ దౌర్జన్యం.. విచారణకు ఎస్పీ ఆదేశం



**న్యూస్ డెస్క్, 20 ఆగష్టు (బిఎన్ఎస్):** 'శక్తి' స్కీమ్, జీవో-97ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్ ముట్టడిలో పాలిటెక్నిక్ విద్యార్థుల పట్ల దురుసుగా ప్రవర్తించిన సీఐ రఘుపతి రెడ్డిపై సమగ్ర విచారణకు జిల్లా ఎస్పీ శబరీశ్ ఆదేశించారు. నిరసన చేపట్టిన విద్యార్థులను అడ్డుకునే క్రమంలో సీఐ రఘుపతి రెడ్డి ఇద్దరు విద్యార్తుల గొంతు పట్టుకుని కొంత సేపు వదలలేదు. ఇందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. దీంతో విద్యార్థుల గొంతు పిసికి చంపేస్తారా? ఇదేనా పోలీసులకు ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలు అంటూ ప్రతిపక్షాలు విమర్శలు గుప్పించాయి. సీఐ తీరుపై సర్వత్రా విమర్శలు రావడంతో ఈఘటనపై సమగ్ర విచారణకు ఎస్పీ ఆదేశించారు.

# రేవంత్ విదేశీ పర్యటనపై అర్వింద్ ఫైర్



**న్యూస్ డెస్క్, 20 ఆగష్టు (బిఎన్ఎస్):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విదేశీ పర్యటన అంతా పొద్దస్తమానం భారతదేశంపై విద్వేషం వెల్లగక్కేవారితో జరగబోతోందని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ ఆరోపించారు. ఈ పర్యటనలో భాగంగా రేవంత్ రెడ్డి వెళ్తున్న ప్రాంతాలు, కలుస్తున్న మనషులు అంతా యాంటీ ఇండియా, యాంటీ నేషనలిస్టుల ఐడియాలజీలు ఉన్న జార్జ్ సోరోస్ లాంటి వారు ఫండింగ్ చేసిన సంస్థలేనన్నారు. ఇవాళ నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయం మీడియాతో మాట్లాడిన అర్వింద్.. రాష్ట్ర జాగ్రఫీ తెలియని వ్యక్తి, ఇంజినీరింగ్ విద్యార్థులను క్రిమినల్ వేస్ట్ అని చెప్పిన వ్యక్తి విదేశాల్లో వెళ్లి ఏం మాట్లాడుతాడు అని ప్రశ్నించారు. మోడీ హయంలో భారత దేశంలో శాంతిభద్రతలు పటిష్టంగా ఉంటే నిద్రపట్టనటువండి విద్యాసంస్థకు రేవంత్ రెడ్డి ఎందుకు వెళ్తున్నారని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనపై ప్రభుత్వం పూర్తి ఎజెండా ఎందుకు విడుదల చేయడం లేదని ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో ఏం చేద్దామని యాంటీ ఇండియా స్కూల్ కు ఎందుకు వెళ్తున్నావో చెప్పాలని డిమాండ్ చేశారు.

రేవంత్ రెడ్డి మిమ్మల్ని కాపాడలేరు:

ఐఏఎస్, ఐపీఎస్?లు రాజకీయ నాయకుల వలలో పడవద్దని రాజశేఖర్ రెడ్డి హయాంలో అనేక మంది మంచి మంచి అధికారులు జైళ్లపాలయ్యారని.. వైఎస్సార్ తో పోలిస్తే రేవంత్ రెడ్డి చాలా చిన్న వ్యక్తి. ఆయన మీ భవిష్యత్?ను కాపాడలేరని అన్నారు. జీవితంలో కాంగ్రెస్ పార్టీ దేశంలో అధికారంలోకి రాదని అధికారులను ఈ రేవంత్ రెడ్డి కాపాడలేరని అన్నారు. జీవన్ రెడ్డి జీవితాన్ని నాశనం చేసిన వ్యక్తి రేవంత్ రెడ్డి అని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ గురించి రేవంత్ రెడ్డి కంటే తనకే ఎక్కువ తెలుసని అందుకే 2029లో తెలంగాణలో సూపర్ మెజారిటీతో బీజేపీ అధికారంలోకి రాబోతోందన్నారు. ఏమైనా చేస్తామని లీగల్?గా చేసి అధికారంలోకి రాబోతోందన్నారు. పరిస్థితులు చూస్తుందే రాష్ట్రంలో అధికారంలోకి వస్తామని బాండ్ పేపర్ రాసి ఇవ్వాలనుందన్నారు.

# అమరావతి చంద్రబాబుకు ఏటీఎం: ఎమ్మెల్సీ బొత్స



**న్యూస్ డెస్క్, 20 ఆగష్టు (బిఎన్ఎస్):** రాజధాని అమరావతి అభివృద్ధి పేరుతో సీఎం చంద్రబాబు కేవలం కాలయాపన చేస్తున్నారని మాజీ మంత్రి, వైసీపీ ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ విమర్శించారు. అమరావతి ఆయనకు ఒక ఏటీఎం కార్డులా మారిపోయిందని ఆయన ఎద్దేవా చేశారు. అమరావతి ప్రాంతంలో క్షేత్రస్థాయిలో ఎలాంటి అభివృద్ధి జరగడం లేదని ఎద్దేవా చేశారు. గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేస్తున్న ప్రభుత్వ స్వరూపం బయటపడిందని బొత్స సత్యనారాయణ విమర్శించారు.

ప్రభుత్వం విఫలమైంది..

రాష్ట్రంలో రెండేళ్ల పాలన పూర్తి కావస్తున్న తరుణంలో ప్రభుత్వ మోసాలు, వైఫల్యాలు ప్రజల ముందుకు వచ్చాయని, ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని బొత్స మండిపడ్డారు. ప్రజా సమస్యలపై పోరాడే చిత్తశుద్ధి తమకు ఉందని ఆయన స్పష్టం చేశారు. మెగా డీఎస్సీ అంశంపై శాసనసభలో కూలంకషంగా చర్చించాలని పట్టుబడుతున్నామని పేర్కొన్నారు. తాము సవాళ్లు విసిరితే అధికార పక్షం చర్చకు రాకుండా పారిపోతోందని బొత్స విమర్శించారు.

# కృష్ణా జలాలతో హుజూర్నగర్ నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేస్తా



నల్లగొండ (బిఎన్ఎస్): సూర్యాపేట జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు పూర్తిచేసి జిల్లాలో సస్యశ్యామలం చేస్తామని భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి అన్నారు... సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలం పాత వెల్లటూరు వద్ద 1648 కోట్ల రూపాయలతో 53000 ఎకరాలకు నీరు అందించే మహాత్మా గాంధీ ముక్త్యాల బ్రాంచ్ కెనాల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ పనులను రాష్ట్ర నీటిపారుదల మరియు ఆహార పౌర సరఫరాల శాఖ మంత్రి నల్లమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి పరిశీలించారు. ముందుగా మంత్రి అండర్ గ్రౌండ్ నందు పంపు హౌస్ పనులను పరిశీలించి పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. తదుపరి సమీక్ష సమావేశంలో మాట్లాడుతూ కృష్ణా నది మీద నిర్మిస్తున్న మహాత్మా గాంధీ ముక్త్యాల బ్రాంచ్ కెనాల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ ద్వారా మట్టంపల్లి మండలంలోని 9 గ్రామాలలో 20,466 ఎకరాలకు, మేళ్లచెరువు మండలంలో 5 గ్రామాలలో 15,829 ఎకరాలకు, చింతలపాలెం మండలంలో 9 గ్రామాలలో 16705 ఎకరాలకు మొత్తం 53000 ఎకరాలకు సాగునీరు అందించడం జరుగుతుందని అన్నారు.. నాగార్జునసాగర్లో నీటి లభ్యత తక్కువగా ఉన్న సమయంలో పులిచింతల ప్రాజెక్టు బ్యాక్‌వాటర్‌ను వినియోగించుకుని ఈ ప్రాంతంలోని గ్రామాలను సస్యశ్యామలం చేయనున్నట్లు మంత్రి తెలిపారు. డిసెంబర్ నాటికీ ప్రాజెక్టు రూఫ్ టాప్ లెవెల్, పంప్ హౌస్ పనులు పూర్తి అవుతాయని వీలైనంత తొందరగా ప్రాజెక్టు పనులు పూర్తి చేసి సాగునీరు అందించాలని మంత్రి గుత్తేదారులను ఆదేశించారు.

# ఆధార్ సేవా కేంద్రం ప్రారంభించిన మంత్రి కోమటిరెడ్డి



నల్లగొండ (బిఎన్ఎస్): ఆధార్ లో ఏమైనా సవరణలు , సమస్యలుంటే పరిష్కరించుకునేందుకు నల్గొండ జిల్లా కేంద్రంలో నూతనంగా "ఆధార్ సేవా కేంద్రాన్ని" ఏర్పాటు చేయడం జరిగిందని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు.. నల్గొండ జిల్లా కేంద్రంలోని పద్మా నగర్ వద్ద కేంద్ర యుఐడిఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన "ఆధార్ సేవా కేంద్రాన్ని" జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ తో కలిసి మంత్రి వెంకటరెడ్డి ప్రారంభించారు.. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ లో ఇది 5 వ ఆధార్ సేవా కేంద్రమని, ఈ కేంద్రం వల్ల జిల్లా ప్రజలతో పాటు, నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ ప్రజలు ఆధార్ కు సంబంధించిన ఏ సమస్య ఉన్న పరిష్కరించుకోవచ్చని అన్నారు.. .జిల్లాలో 100 సంవత్సరాలు పైబడిన వారు 200 మంది ఉన్నట్టు జిల్లా కలెక్టర్ ద్వారా తెలిసిందని, సాంకేతిక సమస్య వల్ల వారి పుట్టిన తేదీ తప్పుగా వచ్చిందని, అయితే సంబంధిత తహసిల్దార్ల ద్వారా వారిని నల్గొండ ఆధార్ సేవా కేంద్రానికి పిలిపించి వారి పుట్టిన తేదీ,వయసు సరిచేయాలని కలెక్టర్ కు సూచించారు. పైసా ఖర్చు లేకుండా, హైదరాబాద్ వెళ్లే పని లేకుండా ఆధార్ లోని సమస్యలను పరిష్కరించుకునేందుకు ఇది చక్కటి అవకాశమని, అందువల్ల జిల్లా ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి కోరారు.

# యూరియా రైతులకు సరిపడా అందించాలి

**-- పాత పద్ధతిలోనే పంపిణీ చేయాలి: సిపిఎం డిమాండ్**

**రైతులందరికీ యూరియా సరఫరా చేయాలి**




సత్తుపల్లి, ఆగస్టు20(బిఎన్ఎస్) న్యూస్: రైతులకు అవసరమైన మేర యూరియాను ఎలాంటి కొరత లేకుండా సరఫరా చేయాలని, పాత పద్ధతిలోనే యూరియా పంపిణీ కొనసాగించాలని సిపిఎం జిల్లా నాయకులు మోరంపూడి పాండురంగారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సత్తుపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రైతు ఫర్టిలైజర్ యాప్ కారణంగా రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే ఆ విధానాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. వ్యవసాయ పనులు కీలక దశలో ఉన్న సమయంలో యూరియా కొరత ఏర్పడితే రైతులు తీవ్రంగా నష్టపోతారని అన్నారు. యాప్‌లో సాంకేతిక సమస్యలు, నెట్‌వర్క్ అంతరాయాల కారణంగా రైతులు గంటల తరబడి ఎరువుల దుకాణాల వద్ద వేచి ఉండాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని పాత విధానంలోనే యూరియా పంపిణీ చేపట్టాలని, రైతులకు అవసరమైన మేర నిల్వలు అందుబాటులో ఉంచి ఎలాంటి కొరత లేకుండా సరఫరా చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి రావుల రాజబాబు మాట్లాడుతూ, రైతుల సమస్యలను ప్రభుత్వం అత్యవసరంగా పరిష్కరించాలని, యూరియా సరఫరాను సక్రమంగా నిర్వహించాలని అన్నారు. రైతుల ప్రయోజనాలను విస్మరిస్తే రైతు సంఘం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిపిఎం సత్తుపల్లి పట్టణ కార్యదర్శి కోలికపోగు సర్వేశ్వరరావు, సిపిఎం నాయకులు మోరంపూడి వెంకట్రావు, చావా రమేష్, చప్పిడి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## పదుల సంఖ్యలో జంతువుల కోసం 20వేల మందికీ

# అభివృద్ధిని దూరం చేయడం అనాగరికం.

- **అటవీ అనుమతులుతో చెరువులకు నీరు అందించండి... లేకుంటే కండలేరు జలాశయం నుండి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా నీరందించాలి**
- **తెలుగు గంగ ప్రాజెక్టు పర్యవేక్షక ఇంజనీర్ సుబ్రమణ్యేశ్వర శర్మకు బిజెపి నమామిగంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ విజ్ఞప్తి**

నెల్లూరు జిల్లా నెల్లూరు(బిఎన్ఎస్):-నెల్లూరు జిల్లాలోని రాపూరు మండలంలో కొండల మధ్యలో నున్న 18 గ్రామాలు వర్షాధారం మీద ఆధారపడి ఉన్నాయి అని ఆగ్రామాలకుసాగునీటి సౌకర్యం కల్పించడంలో అధికారులు పాలకులు విఫలమయ్యారు అని బీజేపీ నేత మిడతల రమేష్ తెలిపారు.అదేవిధంగా గ్రావిటీ ద్వారాసాగు నీరు అందించేందుకు సుమారు 200 కోట్లకు పైగా ప్రభుత్వాలు ఖర్చు చేశాయని అభయారణ్యాల కారణంగా అటవీ అనుమతులు లేక పనులు ఆగిపోయాయి అని తెలిపారు.అదేవిధంగా సాగునీటి కాలువల ప్రాజెక్ట్ డి పి ఆర్ సిద్ధం చేసే నాటికి రాపూర్ మండలం లో అభయారణ్యాలను కేంద్ర ప్రభుత్వం నోటిపై చేయ లేదు అని తెలిపారు.ఈ అంశాన్ని రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు అటవీ శాఖ గుర్తించాలి అని అదేవిధంగా వర్షాధార 18 గ్రామాలలో 700 నుండి 800 అడుగుల లోతుల లో రైతులు బోర్లు వేసుకోవలసి వస్తుంది అని జాతీయ రహదారుల నిర్మాణం- రైల్వే లైన్ల నిర్మాణం లో అభయారణ్యం ఉన్న ప్రాంతాలలో దేశంలో కొన్ని వందల ప్రాంతాలలో అటవీ అనుమతులు ను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసి ఉంది అని వాహనాల ధ్వనులకు హాని కలగని వన్యప్రాణులకు నీటి కాలువలలో శబ్దం లేకుండా సాగునీరు ప్రవహిస్తే వన్యప్రాణుల స్వేచ్ఛ కు హాని ఎలా జరుగుతుందో అర్థం కాని పరిస్థితి పేర్కొన్నారు.అదేవిధంగా భూగర్భంలోపల పైప్ లైన్ నిర్మాణాల ద్వారా వన్యప్రాణుల జీవన విధానానికి హాని కలవకుండా చేయవచ్చు అని కండలేరు వాగు 97 మీటర్ల నుండి రాపూర్ పెద్ద చెరువుకు 88 మీటర్ల నీటి గ్రావిటీ ద్వారా కాలువల నిర్మాణం పూర్తి చేయాలి అని తెలిపారు.అదేవిధంగా పదుల సంఖ్యలో ఉండే వన్యప్రాణుల పేరుతో 20,000 మంది మనుషులు నీటి వసతులు కోల్పోవడం అత్యంత బాధాకరం అని తెలిపారు.కండలేరు జలాశయంలో 79 అడుగుల లెవల్ కు 30 టీఎంసీలు నీటి సామర్థ్యం నుండి లిఫ్ట్ ఇరిగేషన్ పద్ధతిలో వెలుగోను పెద్ద



చెరువుకు, రాపూరు పెద్ద చెరువుకు నిరంధించే ప్రక్రియను ప్రారంభించాలి అని తెలిపారు.సాగునీరు కల్పించకపోవడంతో18 గ్రామాల ప్రజలను అభివృద్ధికి దూరంగా శాశ్వత పేదరికానికి నెట్టెయ్యడమే అవుతుంది.. సత్వర చర్యలకు రమేష్ విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో నరాల సుబ్బారెడ్డి. ఆదినారాయణ. అల్లూరు నాగేంద్ర సింగ్. ముని సురేష్. ముజీబ్ తదితరులు పాల్గొన్నారు

# మొదటి ర్యాంకు సాధించిన విద్యార్థులకు పారితోషికం అందజేత




స్టేషన్ ఘనపూర్, బిఎన్ఎస్, ఆగస్టు 20:
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తాటికొండలో 6 నుండి 10వ తరగతి విద్యార్థులకి ఎఫ్ఏ-1 పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన ఐదుగురు విద్యార్థులు శివకేశ్వర్ 10వ, సంతోష్ 9వ, శాన్వి 8వ,అభిరామ్ 7వ, అశ్విత 6వ తరగతి విద్యార్థులకు ఒక్కొక్కరికి వెయ్యి రూపాయల చొప్పున 5000 రూపాయలను వరంగల్ కి చెందిన శ్రీ దుర్గా సిరామిక్స్ అధినేత వడ్లమూడి యాక నారాయణ అందజేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు పెనుమాటి వెంకటేశ్వర్లు తెలియజేశారు. ఇకనుంచి ప్రతి నెల పరీక్షల్లో అత్యధిక మార్కులు వచ్చిన ఐదుగురు విద్యార్థులకు ఒక్కొక్కరికి వెయ్యి రూపాయల చొప్పున ఈ విద్యా సంవత్సరం ముగిసే వరకు అందజేస్తారని తెలియజేశారు. ఈ పారితోషకాన్ని గ్రామ సర్పంచ్ మారపాక సుజన,పాఠశాల చైర్మన్ బేతి మంజుల మరియు ఉపాధ్యాయుల చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్,చైర్మన్, ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయులు యాక నారాయణకి కృతజ్ఞతలు తెలియజేశారు. విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని పూర్తిగా వినియోగించుకొని మంచి మార్కులు సాధించి ఈ పారితోషకాన్ని అందుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రుద్ర, లింగమూర్తి, రంజిత్ కుమార్, శ్రీనివాస్, మురళి, కృప, సలావుద్దీన్, పీడీ గిరెడ్డి ప్రమోద్ రెడ్డి, సోమేశ్వరి, జగదీష్ మరియు తదితరులు పాల్గొన్నారు.

# తొలి గడప దేవుని కడపలో ఆగస్టు 23 నుంచి అష్టబంధన మహా సంప్రోక్షణ

- **ఏర్పాట్లను పరిశీలించిన టీటీడీ జేఈవో డాక్టర్ ఏ. శరత్**



బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా ఆగస్టు 20: కడపజిల్లా.. దేవుని కడపలోని శ్రీలక్ష్మీ వెంకటేశ్వరస్వామివారి ఆలయంలో ఆగస్టు 23 నుంచి 26వ తేదీ వరకు అష్టబంధన మహా సంప్రోక్షణ కుంభాభిషేకాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించనున్నట్లు టీటీడీ జేఈవో డాక్టర్ ఏ. శరత్ తెలిపారు. అధికారులతో కలిసి ఆలయాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. మహా సంప్రోక్షణకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను జేఈవో ఆదేశించారు. ఇంజినీరింగ్, విద్యుత్ పనులను త్వరగా పూర్తి చేయడంతోపాటు విద్యుత్ దీపాలు, పుష్పాలతో ఆలయాన్ని సుందరంగా అలంకరించాలన్నారు. ధ్వజస్తంభం, బలిపీఠానికి సంబంధించిన ఇత్తడి రేకు పనులను ఆగస్టు 21లోగా పూర్తి చేయాలని సూచించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు.

ఆలయానికి చేరుకున్న జేఈవోకు అర్చకులు సాంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఆలయ ప్రదక్షిణ అనంతరం శ్రీలక్ష్మీ వెంకటేశ్వరస్వామివారిని దర్శించుకున్నారు.

**ఒంటిమిట్ట ఆలయంలోనూ ఏర్పాట్ల పరిశీలన**

అనంతరం జేఈవో ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామివారి ఆలయాన్ని సందర్శించి స్వామివారిని దర్శించుకున్నారు. క్యూలైన్లు, పోటు, యాగశాల, ప్రసాదాల పంపిణీ తదితర భక్తుల సౌకర్యాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం టీటీడీ నిర్మించనున్న 100 గదుల వసతి సముదాయం కోసం కేటాయించనున్న స్థలాన్ని, కల్యాణ వేదిక వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు.

ఈ కార్యక్రమంలో సీఈ శ్రీ మనోహరం, డిప్యూటీ ఈవో ఎ. ప్రశాంతి, సుమతి, డిప్యూటీ ఈఈ నాగరాజు, ఆలయ ఏఈవో ఎన్. రవి, సూపరింటెండెంట్ హనుమంతయ్య, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు ఈశ్వర్ రెడ్డి, మోహన్ బాబు, ఆలయ అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

# దేశ నిర్మాణంలో రాజీవ్ గాంధీ పాత్ర చిరస్మరణీయం



బిఎన్ఎస్ న్యూస్ అయినవోలు/ఆగష్టు 20
భారతదేశ మాజీ ప్రధాని, భారతరత్న దివంగత రాజీవ్ గాంధీ జయంతినిహన్మకొండ జిల్లా ఐనవోలు మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నకరకంటి మోహన్ గౌడ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.వర్ధన్నపేట ఎమ్మెల్యే,రిటైర్డ్ ఐపిఎస్ అధికారి ఆర్ నాగరాజు డిసిసి అధ్యక్షులు ఇనుగాల వెంకటరామిరెడ్డి ఆదేశాల మేరకు ఐనవోలు మండల కేంద్రంలోని నంది సెంటర్ వద్ద రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి పండ్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా నకరకంటి మోహన్ గౌడ్ మాట్లాడుతూ"దేశాన్ని 21వ శతాబ్దపు సాంకేతిక యుగంలోకి నడిపించిన దార్శనికుడు రాజీవ్ గాంధీ.నేడు మనం వాడుతున్న కంప్యూటర్లు, టెలికాం విప్లవానికి నాంది పలికినది ఆయనే"అన్నారు.

"18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించి యువతను దేశ రాజకీయాల్లో భాగస్వాములను చేసిన గొప్ప నాయకుడు రాజీవ్ గాంధీ.73, 74వ రాజ్యాంగ సవరణల ద్వారా పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేసి,గ్రామ పంచాయతీలకు నేరుగా నిధులు, అధికారాలు కల్పించిన ఘనత కాంగ్రెస్ పార్టీ మరియు రాజీవ్ గాంధీదే"అని కొనియాడారు.దేశ సాంకేతిక ప్రగతికి,యువతకు ఓటు హక్కు కల్పించడంలో రాజీవ్ గాంధీ చేసిన కృషిని, ఆయన దూరదృష్టిని గుర్తుచేశారు. ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని శాంతి, మత సామరస్యం, జాతీయ సమగ్రతలను కాపాడుతూ ప్రతి ఒక్క కార్యకర్త ప్రజాక్షేత్రంలో పనిచేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర,జిల్లా,మండల సీనియర్ నాయకులు,అన్ని గ్రామాల ప్రజా ప్రతినిధులు,సర్పంచులు, ఉప సర్పంచులు,కాంటెస్ట్ సర్పంచులు, ఎస్సీ సెల్, మైనార్టీ సెల్, బీసీ సెల్ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు.

# పారదర్శకమైన ఓటర్ల జాబితా తోనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి.!!

- **కడప మాజీ డిప్యూటీ సీఎం ఎస్.బి. అంజాద్ భాష**

బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా ఆగస్టు 20:
కడప పట్టణంలోని మాజీ డిప్యూటీ సీఎం ఎస్.బి. అంజాద్ బాషా జిల్లా పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అంజద్ భాష మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికలు, ఓటర్ల జాబితా అంశాలపై ఆయన పలు కీలక వ్యాఖ్యలు చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలను అక్టోబర్ 3న ప్రచురితమయ్యే నూతన ఎలక్టోరల్ రోల్ ఆధారంగానే నిర్వహించాలని అంజాద్ బాషా డిమాండ్ చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తయ్యే వరకు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించవద్దని వైయస్ఆర్సీపీ పార్టీ తరపున రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికలను ఎదుర్కొనేందుకు వైయస్సార్సీపి పార్టీ శ్రేణులు, కార్యకర్తలు పూర్తి సిద్ధంగా ఉన్నారని, అయితే సరైన మరియు పారదర్శకమైన ఓటర్ల జాబితాతోనే ఎన్నికలు నిర్వహించాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఎస్ఐఆర్ ప్రక్రియలో సుమారు 45 లక్షల ఓట్లు తొలగించారని, మరో 42 లక్షల మందికి నోటీసులు జారీ చేశారని,

వైయస్ఆర్సిపి నేతలు ఆరోపించారు. తొలగించిన ఓట్లలో సుమారు 15.25 లక్షల వరకు మరణించిన వారి ఓట్లు, 7.50 లక్షల డూప్లికేట్ ఓట్లు ఉన్నాయని తెలిపారు. కడప నియోజకవర్గంలోనూ ఓటర్ల సంఖ్య భారీగా తగ్గిందని అంజాద్ బాషా పేర్కొన్నారు. గతంలో సుమారు 2.87 లక్షలుగా ఉన్న ఓటర్ల సంఖ్య ఎస్ఐఆర్ అనంతరం 2.17 లక్షలకు పడిపోయిందని, సుమారు 67 వేల ఓట్లు తొలగించారని, అలాగే 77 వేల మందికి నోటీసులు ఇచ్చారని వెల్లడించారు. భారీగా ఓట్ల తొలగింపుతో డివిజన్లు, స్థానిక వార్డుల రిజర్వేషన్లపై ప్రభావం పడే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సరైన ఓటర్ల జాబితా లేకుండా ఎన్నికలు నిర్వహిస్తే భవిష్యత్‌లో న్యాయపరమైన చిక్కులు తలెత్తే అవకాశం ఉందన్నారు. ఎన్నికల ప్రక్రియలో పూర్తి పారదర్శకత పాటించాలని, ప్రభుత్వం నుంచి వచ్చే ఎలాంటి ఒత్తిళ్లకు రాష్ట్ర ఎన్నికల సంఘం లొంగకుండా స్వతంత్రంగా వ్యవహరించాలని అంజాద్ బాషా పేర్కొన్నారు. కొత్త ఓటర్ల జాబితా ప్రకారమే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘానికి వైయస్ఆర్సీపీ విజ్ఞప్తి చేసింది అన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధికార ప్రతినిధి




జయచంద్రారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు దాసరి శివప్రసాద్, బంగారు నాగయ్య యాదవ్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ తోటా కృష్ణ, నార్త్ జోన్ మండల అధ్యక్షులు బిహెచ్ఇలియాజ్, జిల్లా కార్యదర్శి రమేష్ రెడ్డి మాజీ కార్పొరేటర్లు బసవరాజు, మహమ్మద్ షఫీ, అజ్మతుల్లా ఖాన్, నగర మేధావుల వివాదం ఉపాధ్యక్షుడు మొహమ్మద్ అబ్దుల్లా తదితరులు ఉన్నారు.

# రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో శ్రీ విద్యారణ్య స్కూల్ విద్యార్థుల ఘన విజయం



బండ్లగూడ జాగిర్: బండ్లగూడ జాగిర్‌లోని శ్రీ విద్యారణ్య ఇంటర్నేషనల్ స్కూల్ (SVIS) విద్యార్థులు రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలలో అద్భుతమైన ప్రతిభను కనబరిచి పాఠశాలకు గర్వకారణంగా నిలిచారు. ఇటీవల మహబూబ్‌నగర్‌లో శ్రీ సరస్వతీ విద్యాపీఠం నిర్వహించిన 'రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు – 2026'లో పాఠశాల విద్యార్థులు వివిధ విభాగాల్లో పోటీపడి ఏకంగా 6 బంగారు పతకాలను కైవసం చేసుకున్నారు.

ఈ పోటీలలో SVIS విద్యార్థులు క్రీడాస్ఫూర్తిని చాటుతూ ప్రత్యర్థులపై విజయం సాధించి ఛాంపియన్లుగా నిలిచారు. అండర్-17 బాలికల విభాగంలో వాలీబాల్ జట్టు ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకొని బంగారు పతకాన్ని సాధించింది.

అలాగే, అండర్-17 బాలికల బ్యాడ్మింటన్ పోటీలలో విద్యార్థినులు అత్యుత్తమ ప్రదర్శనతో స్వర్ణ పతకాన్ని తమ ఖాతాలో వేసుకున్నారు.

అండర్-14 బాలుర విభాగంలో జరిగిన అథ్లెటిక్స్ పోటీలలో SVIS విద్యార్థులు సత్తా చాటారు. 100 మీటర్లు మరియు 400 మీటర్ల పరుగు పందెం రెండింటిలోనూ ప్రథమ స్థానాల్లో నిలిచి రెండు బంగారు పతకాలను గెలుచుకున్నారు.

బుద్ధిబలానికి నిదర్శనమైన చెస్ పోటీలలోనూ విద్యార్థులు వెనకడుగు వేయలేదు. అండర్-17 చెస్ విభాగంలో ప్రతిభ చూపి మరో బంగారు పతకాన్ని సొంతం చేసుకున్నారు.



విజేతలతో పాటు ఈ పోటీలలో పాల్గొన్న ప్రతి ఒక్క విద్యార్థినీ, విద్యార్థి లను పాఠశాల యాజమాన్యం మరియు ఉపాధ్యాయ బృందం హృదయపూర్వకంగా అభినందించింది.

విద్యార్థుల విజయానికి కృషి చేసిన ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లు, కోచ్‌లను SVIS కార్యదర్శి విశ్వేశ్వర రావు మరియు ప్రిన్సిపాల్ రమా విశ్వనాథన్ ప్రత్యేకంగా అభినందించారు. క్రీడల్లో విద్యార్థులు ఇలాగే రాణిస్తూ పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పించింది చంద్రబాబే.!

- **ఫిషర్మెన్ కో-ఆపరేటివ్ సొసైటీస్ ఫెడరేషన్ చైర్మెన్ యాటగిరి రాంప్రసాద్.**



బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా ఆగస్టు 20: కడప వైయస్సార్సీపి మాజీ మేయర్ పాకా సురేష్ కుమార్ కు మతిమరుపు వచ్చినట్లుంది. 24 శాతానికి తగ్గించిన బీసీ వ్యతిరేకి జగన్, దాదాపు 17 వేల మంది బీసీలను పదవులకు దూరం చేసిన ద్రోహి జగన్మోహన్ రెడ్డి కాదా అంటూ ఆఫ్కాఫ్ ఛైర్మెన్ యాటగిరి తెలుపుతూ..

ముఖ్యమంత్రి చంద్రబాబు 1995 లోనే బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికలలో 34 శాతం రిజర్వేషన్ కల్పించిన సంగతి మతి మరుపు కారణంగా మాజీ మేయర్ పాక సురేష్ మరిచి పోయినట్లున్నారని ఫిషర్మెన్ కో-ఆపరేటివ్ సొసైటీస్ ఫెడరేషన్ ఛైర్మెన్ యాటగిరి రాంప్రసాద్ ఏద్దేవా చేసారు. కాగా 2019 లో అధికారంలోకి వచ్చాక జగన్ రిజర్వేషన్ ను 34 శాతం నుంచి 24 శాతం కు తగ్గించి దాదాపు 17 వేల మంది బీసీలను స్థానిక పదవులకు దూరం చేసి ద్రోహం చేసారని ఆరోపించారు. ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేస్తూ 1986లో అప్పటి ముఖ్యమంత్రి ఎన్ టి ఆర్ స్థానిక ఎన్నికలలో బీసీలకు 20 శాతం రిజర్వేషన్ కల్పించారని 1995 లో చంద్రబాబు 34 శాతానికి పెంచిన సంగతి పాక గుర్తుకు తెచ్చు కోవాలన్నారు. వారు కల్పించిన వెసలుబాటు తోనే మీరు మేయర్ పదవిలో ఉన్నది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. 1995 నుంచి 2018 వరకు కొనసాగిన 34 శాతం రిజర్వేషన్ 2019 లో 24 శాతానికి ఎందుకు తగ్గిందో పాక అండ్ టీమ్ జగన్ ను అడిగి తెలుసుకోవాలని సూచించారు. బీసీల వ్యతిరేకి జగన్ హైకోర్టు ఆదేశాలంటూ, సుప్రీం కోర్టుకు వెళ్లకుండా 24 శాతం అమలు చేయడం బీసీలకు ద్రోహం చేయడం కాదా అని మండిపడ్డారు. మళ్ళీ 34 శాతం రిజర్వేషన్ తో బీసీలు ఆనందంగా ఉంటే ఓర్వలేని జగన్. ఇప్పుడు కొత్తగా చిక్కులు తెచ్చేందుకు పాకా లాంటి వ్యక్తులతో కుట్రకు పాల్పడుతున్నట్లు పాక వ్యాఖ్యలతో అర్థమౌతుదన్నారు. వీరెన్ని కుట్రలు చేసినా బీసీలు టీడీపీ పక్షానే ఉంటారని రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు టీడీపీకి ఏక పక్షం కానున్నాయని ఆఫ్కాఫ్ ఛైర్మెన్ యాటగిరి రాంప్రసాద్ ధీమా వ్యక్తం చేసారు.

# రాజంపేటలో టీడీపీ విస్తృత స్థాయి సమావేశం.

- **బీసీలకు 33% రిజర్వేషన్ల ప్రకటనపై 'జయ హో బీసీ' నినాదంతో మార్మోగిన సభ...!!**
- **రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాలు కైవసం చేసుకోవడమే లక్ష్యం: చమర్తి జగన్ మోహన్ రాజు**



బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా ఆగస్టు 20:

పార్టీ పదవులు ప్రజలకు, పార్టీకి సేవ చేయడానికే కానీ పెత్తనానికి కాదు. రాష్ట్రానికి లక్షల కోట్ల పెట్టుబడులు, సంక్షేమం, అభివృద్ధిని పరుగులు తీయిస్తున్న కూటమి ప్రభుత్వం. ప్రతిష్టాత్మకంగా ఇంటింటికి తెలుగుదేశం ప్రజల్లోకి ప్రభుత్వ విజయాలు అంటూ రాజంపేట పట్టణంలోని స్థానిక ఎన్ కే ఎన్ కళ్యాణమండపంలో తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ స్థాయి విస్తృత సమావేశం ఘనంగా జరిగింది. ఈ సమావేశంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు నియోజకవర్గ పరిశీలకులు భీమినేని చిట్టిబాబుతో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.

**'జయ హో బీసీ' నినాదంతో ప్రసంగం ప్రారంభం**

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయాన్ని స్వాగతిస్తూ, చమర్తి జగన్ మోహన్ రాజు జయ హో బీసీ అని నినదిస్తూ తన ప్రసంగాన్ని ప్రారంభించారు. బీసీల అభ్యున్నతికి, రాజకీయ ఎదుగుదలకు తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ వెన్నంటి ఉంటుందని, ఈ నిర్ణయం స్థానిక సంస్థల్లో బీసీల ప్రాతినిధ్యాన్ని సరికొత్త శిఖరాలకు తీసుకెళ్తుందని స్పష్టం చేశారు.

**అన్ని స్థానాల్లో గెలుపే లక్ష్యంగా సమాయత్తం కావాలి:**

రాష్ట్రంలో ఆర్థిక ఒడిదుడుకులు ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, యువ నాయకుడు నారా లోకేష్ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిని సమపాళ్లలో ముందుకు తీసుకెళ్తోందని చమర్తి పేర్కొన్నారు. రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నిలుపుతూ లక్షల కోట్ల పెట్టుబడులను తీసుకొస్తున్నారని తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలు సమష్టిగా, పూర్తి అప్రమత్తతతో పనిచేసి రాజంపేట నియోజకవర్గంలోని అన్ని స్థానాలను క్లీన్ స్వీప్ చేయాలని, విజయం మనదేనని ధీమా వ్యక్తం చేశారు.

**ప్రజల్లోకి ప్రభుత్వ సంక్షేమం- ఇంటింటికీ తెలుగుదేశం**

కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి గడపకూ చేరవేస్తూ పార్టీ శ్రేణులు 'ఇంటింటికి తెలుగుదేశం' కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో విజయవంతం చేయాలని, ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకుంటూ ముందుకు సాగాలని చమర్తి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాజంపేట మండల నాయకులు, రాష్ట్ర డైరెక్టర్లు, మాజీ డైరెక్టర్లు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, సింగిల్ విండో చైర్మన్లు, పార్టీ రాష్ట్ర, పార్లమెంట్, మండల కమిటీల నాయకులు, క్లస్టర్, యూనిట్, బూత్ కన్వీనర్లు, వివిధ అనుబంధ సంఘాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ప్రెస్‌క్లబ్ భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలి

## తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసిన రేగొండ జర్నలిస్టులు



బిఎన్ఎస్ న్యూస్ భూపాలపల్లి రేగొండ

రేగొండ మండల కేంద్రంలో ప్రెస్‌క్లబ్ భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరుతూ రేగొండ మండల ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గ సభ్యులు గురువారం తహసీల్దార్ శ్వేతారావును మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు మాట్లాడుతూ,స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఆదేశాల మేరకు మండల కేంద్రంలో ప్రెస్‌క్లబ్ భవన నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని కేటాయించి సహకరించాలని కోరారు. ఇందుకు తహసీల్దార్ శ్వేతారావు సానుకూలంగా స్పందిస్తూ,మండల సర్వేయర్ ద్వారా ప్రభుత్వ స్థలాలను పరిశీలింపజేసి ప్రెస్‌క్లబ్ స్థల కేటాయింపునకు తనవంతు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. అలాగే నూతనంగా ఎన్నికైన కార్యవర్గానికి ఆమె శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు సుంకరి శ్రీధర్, గౌరవ అధ్యక్షుడు నామాల రమేష్, గౌరవ కార్యదర్శి ఆకుల వెంకటేష్, కోశాధికారి బత్తుల ఆనంద్, ఉపాధ్యక్షులు పల్నాటి రాజు, గన్‌రెడ్డి కరుణాకర్‌రెడ్డి, కార్యదర్శి గంగిరేణి రమేష్, కార్యవర్గ సభ్యులు బోయిని రాజు,బత్తుల వెంకటేశ్వర్లు, బండి సమ్మయ్య, వెంగళ రణధీర్, గుర్రం స్వరాజ్, బండారి తిరుపతి, ప్రవీణ్, గునిగంటి రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ వృత్తి సమాజంలో ఎంతో ఉన్నతమైనది: పతకమూరి శ్రీనివాసరావు

జమ్మికుంట,బిఎన్ఎస్:

ఉపాధ్యాయ వృత్తి సమాజంలోనే అత్యంత ఉన్నతమైనదని, భావితరాలను ఉత్తమంగా తీర్చిదిద్దే అద్భుతమైన బాధ్యత ఆచార్యులపైనే ఉందని శ్రీ సరస్వతీ విద్యాపీఠం ప్రాంత సంఘటనా కార్యదర్శి పతకమూరి శ్రీనివాసరావు పేర్కొన్నారు. శ్రీ విద్యారణ్య ఆవాస విద్యాలయం కేశవపురం – జమ్మికుంట సంకులంలో శిక్షణ పూర్తి చేసుకున్న ఆచార్యులతో ఆయన ప్రత్యేకంగా సమావేశమై పలు అంశాలపై దిశా నిర్దేశం చేశారు. నిరంతర సాధన, అంకితభావంతో బోధనా రంగంలో ఆచార్యులు రాణించాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

అనంతరం కేశవపురం, వీణవంక, జమ్మికుంట పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రబంధకారిణి సభ్యులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పాఠశాలల నిర్వహణ, విద్యా ప్రమాణాల పెంపు, విద్యార్థుల్లో క్రమశిక్షణ వంటి పలు కీలక అంశాలపై సమగ్రంగా చర్చించి పలు సూచనలు చేశారు.

దీనిని పురస్కరించుకుని జిల్లా మరియు విభాగ్ కార్యకారిణి సమావేశాన్ని కూడా నిర్వహించారు. రాబోయే రోజుల్లో చేపట్టాల్సిన విద్యా, సామాజిక కార్యక్రమాలపై కార్యాచరణను సిద్ధం చేసి, సంబంధిత బాధ్యులకు తగిన మార్గదర్శనం అందించారు.

ఈ సమాచార, సమీక్షా సమావేశాల్లో విద్యా రంగ ప్రముఖులు, సంస్థ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పాఠశాలల అభివృద్ధి, సమగ్ర విద్యా బోధన లక్ష్యంగా ఈ భేటీలు ఫలవంతంగా సాగాయి.



కార్యక్రమంలో ప్రాంత సహ శైక్షణిక ప్రముఖ్ కదార్ల కుమార్, విభాగ్ అధ్యక్షులు ముక్కాల సీతారాములు, కార్యదర్శి మేచినేని దేవేందర్ రావు, శైక్షణిక ప్రముఖ్ కాటం రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# రూపిరెడ్డిపల్లి మున్నూరు కాపు సంఘం నూతన కమిటీ ఎన్నిక



బిఎన్ఎస్ న్యూస్ భూపాలపల్లి రేగొండ

జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం రూపిరెడ్డిపల్లి గ్రామ మున్నూరు కాపు సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా మేడిపల్లి వెంకటేష్, ఉపాధ్యక్షుడిగా బండారి జనార్ధన్, కోశాధికారిగా మంచిపెల్లి వెంకటేష్, ఉప కోశాధికారిగా పగడాల సదానందం ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మేడిపల్లి వెంకటేష్ మాట్లాడుతూ,తనపై నమ్మకంతో అధ్యక్ష బాధ్యతలు అప్పగించినందుకు సంఘ సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. సంఘం అభివృద్ధికి పాటుపడుతూ,మున్నూరు కాపుల సంక్షేమం కోసం ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు, సభ్యులు పంచగిరి బాబురావు, అగయ్య, సుధాకర్ , ప్రకాశ్, తోట శ్రీనివాస్, సర్వ్ రవి, సర్వ్ కుమారస్వామి, రాజు, తోట రాంకిషన్, మేడిపల్లి అశోక్, రావుల సారయ్య, నర్సయ్య, సమ్మయ్య, గోపి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల ఆస్తులు దోచుకోవటానికే 22 ఏ నిషేధిత జాబితా

- **జనం నుంచి తిరుగుబాటు రాగానే...తప్పు జరిగింది సరిదిద్దుకుంటామంటారా?**
- **ప్రభుత్వానికి తెలియకుండా ఇదంతా జరగటమంటే...మీది చేతకాని దద్దమ్మ ప్రభుత్వమే**
- **ప్రజలకు అన్యాయం జరిగితే ఎట్టి పరిస్థితుల్లో సహించేది లేదు**
- **తెలంగాణ రక్షణ సేన నాయకులు గొంగళ్ల రంజిత్ హెచ్చరిక**

బిఎన్ఎస్ ,హైదరాబాద్:

ప్రజల ఆస్తులను దోచుకునేందుకే రేవంత్ సర్కార్ 22ఏ నిషేధిత జాబితా తీసుకొచ్చిందని తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర నాయకులు గొంగళ్ల రంజిత్ మండిపడ్డారు. ప్రజల ను భయాందోళనకు గురిచేసి వారి ఆస్తులు, వారి నుంచి కమిషన్లను దండుకునే దుర్మార్గం చేస్తున్నారన్నారు. బంజారాహిల్స్ లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో ఆయన గురువారం మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వ ఆనాలోచిత నిర్ణయం కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల ఆస్తులను రక్షించాల్సిన ప్రభుత్వమే వారిలో అభద్రత భావం కలిగిస్తూ కమిషన్లు దండుకునే కుట్ర చేయటమేమిటనీ ప్రశ్నించారు. హైదరాబాద్ నగరంలో కోటి ఎకరాలకు పైగా నిషేధిత జాబితాలో పెట్టారని రంజిత్ చెప్పారు. ప్రైవేట్ ఆస్తులను నిషేధిత జాబితాలో పెట్టే హక్కు ప్రభుత్వానికెక్కడిదని ఆయన ప్రశ్నించారు. ప్రజలను భయపెట్టి పీల్చి పిప్పి చేసే దిక్కుమాలిన నిర్ణయం ఇదంటూ ఆయన మండిపడ్డారు. ఎట్టి పరిస్థితుల్లో ప్రజలకు అన్యాయం జరగనివ్వమని...బాధితుల తరఫున తెలంగాణ రక్షణ సేన పోరాటం చేస్తుందని రంజిత్ చెప్పారు.


**చేతగాని దద్దమ్మ ప్రభుత్వం**




22 ఏ విషయంలో ప్రజల నుంచి పెద్ద ఎత్తున తిరుగుబాటు రావటంతో ప్రభుత్వంలో గందరగోళం మొదలైందని రంజిత్ అన్నారు. డ్యామేజ్ ను కంట్రోల్ చేసుకునేందుకు మంత్రులు ఇష్టమొచ్చిన స్టేట్ మెంట్లు చేస్తున్నారని చెప్పారు. మంత్రి కోమటి రెడ్డి అసలు ఈ విషయమే తెలియదని అంటుంటే రెవెన్యూ మంత్రి పొంగులేటి మాత్రం తప్పు జరిగింది సరిదిద్దుకుంటామని అంటున్నారని చెప్పారు. ఇంత పెద్ద నిర్ణయం ప్రభుత్వానికి తెలియకుండా జరగటమంటే ఇది ఎంత దద్దమ్మ ప్రభుత్వమో అర్థం చేసుకోవచ్చున్నారు. పొంగులేటి చెప్పిన దాని ప్రకారం తప్పు జరిగి ఉంటే సంబంధిత అధికారులపై ఎందుకు చర్యలు తీసుకోవటం లేదో చెప్పాలన్నారు. రియల్ ఎస్టేట్ దందా చేసే ముఖ్యమంత్రి, రెవెన్యూ మంత్రి ధనదాహం కారణంగానే ఈ 22 ఏ అనేది పుట్టుకొచ్చిందని రంజిత్ చెప్పారు. తమకు అనుకూలంగా ఉండే వారికి అన్ని విధాలుగా సాయం చేసేలా...నచ్చని వాళ్లను ఇబ్బంది పెట్టేలా 22ఏ ను వాడుతున్నారని విమర్శించారు. 22 ఏ కారణంగా సామాన్య ప్రజలు ఒక్కరికీ ఇబ్బంది జరిగిన ఊరుకునేది లేదని ఆయన హెచ్చరించారు. ప్రైవేట్ ఆస్తులను నిషేధిత జాబితాలో ఉంచిన ఈ వ్యవహారంలో పారదర్శకంగా విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలంటూ రంజిత్ డిమాండ్ చేశారు.

# ఏఈ నూకరాజు కుమార్తె సౌజన్య మృతదేహం లభ్యం

రాజమహేంద్రవరం,బిఎన్ఎస్: ఇటీవల గోదావరిలో దూకిన ఏఈ నూకరాజు కుమార్తె సౌజన్య మృతదేహం లభ్యమైంది. రావులపాలెం మండలం కొమరాజులంక వద్ద మృతదేహాన్ని గుర్తించారు. ధవళేశ్వరం బ్యారేజీ నుంచి దిగువన 35 కిలోమీటర్లు దూరం మృతదేహం కొట్టుకుని వచ్చింది. ఇప్పటికే నూకరాజు మృతదేహం లభించగా, ఆయన భార్య మీనా మృతదేహం కోసం గాలిస్తున్నారు.



కాకినాడకు చెందిన రైఫిల్ షూటింగ్ శిక్షకుడు సాధిక్ ఖాన్ వేధింపులు తాళలేక పంచాయతీరాజ్ శాఖ ఏఈ నూకరాజు కుటుంబం గోదావరిలోకి దూకిన ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో మనవడు కార్తికేయ నదిలో ఈదుకుంటూ ప్రాణాలతో బయటపడ్డాడు. ఈ కేసులో నిందితుడు సాధిక్ ఖాన్ కోసం పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు.